ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 02-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఉత్తర, దక్షిణ ప్రాంతాల సాంస్కృతిక ఐక్యతను కాశీ తమిళ సంగమం సూచిస్తుందని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణ (ఎస్ఐఆర్) అంశంపై ప్రతిష్టంభన కొనసాగడంతో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది.
- తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జీవితం ప్రతి రాజకీయ నాయకుడికి స్ఫూర్తిదాయకమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ ఈ నెల 8వ తేదీన ప్రత్యేక చర్చను నిర్వహించనుందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = =

ఉత్తర, దక్షిణ ప్రాంతాల సాంస్కృతిక ఐక్యతను ఉమ్మడి నాగరికత వారసత్వాన్ని కాశీ తమిళ సంగమం సూచిస్తుందని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. కాశీ తమిళనాడు మధ్య వేల సంవత్సరాల బంధం ఉందని ఆయన పేర్కొంటూ.. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఇది మరింత బలపడుతుందని తెలిపారు. కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వారణాసిలో కాశీ తమిళ సంగమం 4.0 కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి దృశ్య మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ... కాశీ తమిళ సంగమం ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్..ను ప్రతిబింబిస్తుందని అన్నారు. కాశీలోని నమో ఘాట్‌లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో తమిళనాడు నుండి 1,400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. తమిళం నేర్చుకోండి అనే ఇతివృత్తంతో ఈసారి కార్యక్రమం జరుగుతోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ కూడా పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణ (SIR) అంశంపై ప్రతిష్టంభన కొనసాగడంతో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. SIR అంశంపై చర్చకు ప్రతిపక్షం డిమాండ్ చేయడంతో లోక్ సభ రెండు సార్లు వాయిదా పడింది. రెండవసారి వాయిదా పడిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి SIRకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినప్పటికీ  స్పీకర్ ఓం బిర్లా సభను కొనసాగించడానికి ప్రయత్నించారు. పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రతిపక్షం తమ నిరసనను కొనసాగించింది. అంతకుముందు.. మొదటి వాయిదా తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభ సమావేశమైనప్పుడు కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి పార్టీలతో సహా ఇతర పార్టీల సభ్యులు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి SIR మీద చర్చ కోసం డిమాండ్ చేశారు. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభను మరోసారి వాయిదా వేశారు. రాజ్యసభలో సైతం ప్రతిపక్షాల నిరసన మధ్య సభ రెండు సార్లు వాయిదా పడింది. సభలో ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. 267 నిబంధన ప్రకారం SIR అంశంపై చర్చకు  ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

= = = = = = = = = = = = = = = = = =

ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో మంత్రి ఈ రోజు మాట్లాడుతూ... సభ కార్యకలాపాలు సజావుగా సాగేలా సభ్యులు అంతా సహకరించాలని కోరారు. ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా (ఎస్ఐఆర్) అంశంపైన పార్లమెంటు కార్యకలాపాలకు ప్రతిపక్షాలు అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు. కొత్త సమస్యలతో సభా కార్యక్రమాలకు ఆటంకం  కలిగించవద్దని కోరారు. సభలో చర్చించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని కిరణ్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జీవితం ప్రతి రాజకీయ నాయకుడికి స్ఫూర్తిదాయకమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలోని సద్లి గ్రామంలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ... పటేల్ పాటించిన విలువలు, నిబద్ధత  దేశాన్ని ఐక్యంగా ఉంచగలిగాయని గుర్తు చేశారు. పటేల్‌ను ఐక్య భారతదేశ నిర్మాతగా సంస్థానాలను ఏకీకృతం చేసిన నాయకుడిగా కేంద్రమంత్రి ప్రశంసించారు. పటేల్@150వ జయంతిని జరుపుకోవడం ద్వారా ఆయన ఆలోచనల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = =

జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ ప్రత్యేక చర్చను ఈ నెల 8న నిర్వహించనుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ నెల 9న లోక్ సభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ జరుగుతుందని అన్నారు. పార్లమెంటు భవనంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. లోక్ సభ తరువాత రాజ్యసభలో కూడా చర్చను చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = =

దేశంలో గత దశాబ్ద కాలంలో స్వచ్ఛందంగా పన్ను చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 18వ గ్లోబల్ ఫోరమ్ ప్లీనరీ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ... పన్ను విషయాలలో పారదర్శకమైన విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. పన్నుల చెల్లింపులు పెరగడం మీదనే జాతీయ సంపద వృద్ధి ఆధారపడి ఉందన్నారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారిని గుర్తించడం, పన్ను ఎగవేతాదారుల పట్ల కఠినంగా వ్యవహరించడం లాంటివి చేయడం ద్వారానే చెల్లింపులలో పెరుగుదలను చూడగలమని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

సంచార్ సాథీ యాప్ పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధమైనదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడి డిజిటల్ భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. సంచార్ సాథీ అనేది పారదర్శకమైనదని సామాజిక మాధ్యమం ఎక్స్ లో చేసిన పోస్టులో తెలిపారు. సులభమైన సాధనాల ద్వారా దేశ ప్రజలు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి వీలు కల్పించే యాప్ గా పేర్కొన్నారు. వినియోగదారులు తమ సౌలభ్యం మేరకు యాప్‌ను ఉపయోగించవచ్చన్నారు. ఈ యాప్ ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకూ 20 కోట్ల మందికి పైగా ప్రజలు పోర్టల్‌ను ఉపయోగించారని కేంద్ర మంత్రి చెప్పారు. అదే విధంగా 1.4 కోట్లకు పైగా ప్రజలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, పంజాబ్‌లలో ఈరోజు చలి గాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలియచేసింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మాహే, తమిళనాడు-పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాలలో ఉరుములు మెరుపులతో కూడిన ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, ఒడిశా ప్రాంతాలలో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి, పశ్చిమ, మధ్య బంగాళాఖాతం, తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర శ్రీలంక తీరాలలో రేపటి వరకు చేపల వేటను పూర్తిగా నిలిపివేయాలని వాతావరణ శాఖ ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 641 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరకు 503 పాయింట్ల నష్టంతో 85,138 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 143 పాయింట్ల నష్టంతో 26 వేల 032 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 91 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.11 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 186 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = =

భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో వన్డే క్రికెట్ మ్యాచ్ రాయ్‌పూర్ వేదికగా రేపు జరగనుంది. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో విజయం సాధించిన భారత్ రెండో మ్యాచ్‌కు సిద్ధ మవుతోంది. రాయ్‌పూర్ షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా రేపు మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = =

దేశ జనాభాలో 50 శాతం మంది సహకార సంఘాలతో అనుసంధానించబడి ఉన్నారని కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. లోక్‌సభలో ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... దేశవ్యాప్తంగా 8 లక్షల సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 30 కోట్ల మంది ఈ సంఘాలతో సభ్యులుగా ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉన్నారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =